# జీవుని బాధించి, దేవుని పూజించటము సరికాదు!

భానుతేజముకంటె భాసిల్లుచుండు
మంచు తెలుపుకంటె మించియుండు
ఆకాశముకన్న అతి సూక్ష్మమైయుండు
సర్వజీవులయందు పర్వియుండు
బ్రహ్మంబు కానిది యిలను యేదియులేదు
సర్వజీవులందు సంచరించు

బ్రహ్మయే మీరు మీలోన బ్రహ్మయుండె
మీకు బ్రహ్మకు భేదంబు లేకయుండె
ఇంత కన్నను వేదాంతమేమి చెపుదు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా

నేనె వెలుగులో నున్నాను నేనె వెలుగు
వెలుగు నాలోన నున్నది వెలుగు నేనె
అట్టి జ్ఞానము మనసున హత్తుకొన్న
అతడె బ్రహ్మంబు బ్రహ్మమే అతడౌను

**దివ్యాత్మస్వరూపులారా!**

భగవంతుని మానవరూపమును మానవుడే గుర్తించుటకు వీలగునుగాని అన్యజీవులు గుర్తించలేవు. కనుక, మానవ రూపమును మనము గౌరవించవలెను. 'దైవం మానుషరూపేణ!' భగవంతుడు మానవాకారమును ధరించి, జగత్తును వరించి, ప్రజలను ప్రేమించి, అనుగ్రహించే నిమిత్తమై అవతరించును.

'అంతర్బహిశ్చ తత్ సర్వం వ్యాప్య నారాయణ స్థితః.' భగవత్తత్త్వమనేది, ఆత్మతత్త్వమనేది,

sri sathyasai vahanamrutam

బ్రహ్మతత్త్వమనేది సర్వత్రా వ్యాపించినదే! 'ఈశావాస్యమిదం సర్వమ్' అనగా భగవంతుడు ఈ జగత్తునందు సమస్త పదార్థములందు వున్న దివ్యశక్తియే! అట్టి సర్వత్రా వుండిన దివ్యత్వాన్ని మానవుడు మాత్రమే గుర్తించగలడుగానీ, ఇతర జీవులు గుర్తించలేవు.

**'నేను మానవుడను' అనే భావన వున్నంతవరకు మానవాతీమైన దివ్యత్వమును గ్రహించడం సాధ్యంకాదు**

ఈనాడు ప్రపంచమునుగురించి, సమాజమునుగురించి అనేక వస్తువుల గురించి అద్భుతమైనరీతిగా వైజ్ఞానికముగా ఉపన్యసించవచ్చును. కీర్తి, ఘనతలను ఆర్జించవచ్చును. మనుష్యాకారమును ధరించిన దైవత్వమునుకూడా అనేక విధములుగా విమర్శించవచ్చును. కాని, ఇవన్నీ కేవలము కల్పనలు మాత్రమే! ఇందులో యథార్థము ఏమాత్రము యిమిడి వుండదు. వాచాలుడైన పండితుడు ఎన్ని ప్రగల్భములైనా చెప్పవచ్చుగాని, నిజమైన దివ్యత్వాన్ని ఏ మానవుడు చూడలేదు, చూడబోరు. దాని నిజస్వరూపమును మానవస్వరూపమునందే గుర్తించటానికి వీలవుతుందిగాని అన్యమార్గములందుగాని, అన్యసాధనలయందుగాని దివ్యత్వాన్ని గుర్తించలేరు, నిరూపించలేరు. తాము గుర్తించుకున్నది తమయొక్క భ్రాంతులే, తమయొక్క కల్పనలే! ఒక ఏనుగు భగవంతుని అర్చించవచ్చు. అది తన ప్రకృతి సౌలభ్యమును పురస్కరించుకొని భగవంతుని పెద్ద ఏనుగుగా ఊహించుకొనవచ్చును. అంతేగాని వేరొక స్వరూపాన్ని నిర్మించుకొనలేదు. ఎలుకకూడా భగవంతుని అర్చింపగోరి తన ప్రకృతిని పురస్కరించుకొని భగవంతుని తనకంటె ఎన్నోరెట్లు బ్రహ్మాండమైన ఎలుకగా తాను భావించుకొనవచ్చును. అదేవిధముగా మానవుడు తన ప్రకృతిని పురస్కరించుకొని, తానుకూడా మానవాకారమునే నిర్మించుకొనవచ్చును తప్ప అన్యమైన, అతీతమైన మానవత్వాన్ని నిర్మించుకొనటం సాధ్యము కాదు. 'నేను మానవుడను', అనుకొన్నంతవరకు మానవాతీతమైన దివ్యత్వాన్ని గ్రహించడం సాధ్యంకాదు. కొంతమంది పండితులు 'భగవంతుడు అప్రమేయుడు, అవాఙ్మానసగోచరుడు, నిర్గుణుడ'ని వర్ణిస్తారు. యిందులో కేవలము పదముల ప్రాబల్యము బాగా కనిపించవచ్చు. ఈ పదములకు అర్థములు చెప్పవచ్చును. ఈ పదములను నానార్థములుగా విభజించవచ్చును. కానీ, తమ అనుభవములోపల యిది నిరర్థకమే, అనర్థమే;

srisathyasaivachanamrutam

యథార్థమును గ్రహించలేకపోవచ్చు.

ఏ సమయమునందైనా మీకు అనుకూలము సంభవించినప్పుడు ఏ పండితుడినైనా 'అప్రమేయుడనగా ఏమిటి', అని ప్రశ్నించండి. వెంటనే అతడు ప్రమాణములకు చిక్కనివాడని సమాధానము చెబుతాడు. 'భగవంతుడు అవాఙ్మానసగోచరుడు' అని వర్ణిస్తాడు. 'మనస్సుకు, వాక్కుకు అతీతమైనవాడు భగవంతుడు' అని అర్థము చెప్పవచ్చును. యింతకంటె భగవంతుని స్వరూపాన్ని నిరూపించలేడు కదా! నా ఉద్దేశ్యములో యిలాంటి పదములకు అర్థము నిరూపించ యత్నించే పండితునికంటె సామాన్య మానవుడే మేలని అనిపిస్తుంది. ఈ అర్థములను సామాన్య మానవుడుకూడ చెప్పగలడు. కాని అతడు ఈ తర్కవితర్కములలో ప్రవేశించక మౌనము వహిస్తాడు. తద్వారా సమాజములో కొంత శాంతి ఏర్పడుతుంది. అయితే ఈ పండితుడు చెప్పే అర్థాలవల్ల సమాజములో కొన్ని అలజడులు ఏర్పడుతున్నాయి. సమాజములో శాంతికి విఘాతము కలుగుతుంది. ఈ విధముగా ప్రపంచములో అశాంతి ప్రబలేటట్లు చేయటంకంటె పదములకు అర్థము చెప్పకుండా మౌనము వహించటమే గొప్పతనమని చెప్పవచ్చు. ఆనాటినుండి ఈనాటివరకు పదములను వర్ణించి, ఆ పదముల అర్థములను బోధిస్తూ వస్తున్నారేగాని యథార్థ స్వరూపాన్ని యింతవరకు ఎవ్వరూ నిరూపించలేదు. సర్వులయందుండిన దివ్యత్వమే భగవంతుడు. సర్వరూపములు తానే! ఇలాంటి దివ్యత్వాన్ని మానవుడు ఏ విధముగా వర్ణించగలడు? ఏది నిశ్చయమని చెప్పగలడు?

**కానిదిదియని చెప్పంగగలరు కాని**
**బ్రహ్మమిదియని ఎవరు చెప్పంగ గలరు?**

**సజీవులను హింసించటము, నిర్జీవులను పూజించటము భారతీయుల బలహీనత**

పుష్పములోని సుగంధమువలె మానవునిలోని దివ్యత్వము అంతర్గతముగా ఉంటుంది కట్టెలోని అగ్నివలె, తిలలోని తైలము వలె. మానవునియందు దివ్యత్వము సర్వత్రా వ్యాపించివున్నది. కానీ, ఈ అంతర్ తత్త్వాన్ని గుర్తించుకొనలేక కేవలము బహిర్ముఖమైన రూపములనే భ్రమించి అదియే సత్యమని భావిస్తున్నారు. ప్రాచీన కాలమునుండి మానవుడు ఈ విధంగా అజ్ఞానములో మునిగి ఉంటూనే వచ్చాడు. పుట్టలో పాముకు పాలు పోస్తున్నారు, కానీ పామును చూస్తే

sri sathyasai vahini amrutam

చంపివేస్తున్నారు.

**సేవ చేయునట్టి సేద్యపు పశువును**
**చేరి చితగగొట్టు చిత్రముగను**
**రాతి ఎద్దును చూచి భక్తితో పూజించు**

ఇది ప్రాచీన కాలమునుండి వచ్చిన మన వేదాంతము. సజీవులను హింసించటము, నిర్జీవులను పూజించటము భారతీయుల బలహీనత. ఆకలిగొన్న మానవునకు పట్టెడన్నము పెట్టని మానవుడు భగవంతునకు అతి రుచికరమైన పదార్థములను నైవేద్యముగా అర్పిస్తున్నాడు.

**ముడుపులందు ధనము మూటగట్టి**
**బిచ్చగానికి మెతుకైన పెట్టకుండ**
**వెంకటేశుని హుండిలో వేయు లోభి**

ఈ విధముగా ప్రాచీన సాంప్రదాయాన్ని అనుసరిస్తూ వస్తున్నారు. నిజముగా సజీవముగా వున్న వ్యక్తికి పట్టెడన్నము పెడితే ఎంత సార్థకము! కనుక, దైవము మానవరూపములో వున్నాడన్న సత్యాన్ని మనము గుర్తించాలి, వర్తించాలి. జీవుని బాధించటము, దేవుని పూజించటము యిదియా మన కర్తవ్యము?

ఆకాశమునందు వాయువు ఏ విధముగా లీనమైవున్నదో అదేవిధముగానే ప్రకృతి అంతయు ఆత్మయందు లీనమైవున్నది. గాలికి, ఆకాశము వుపాదాన కారణము. ఉపాదాన కారణమనగా దేనివలన ఏది సృష్టింపబడుతున్నదో, ఆ సృష్టించేదే ఉపాదాన కారణము. ఆకాశము ఆశ్రయము, గాలి ఆశ్రితము. గాలికి ఆశ్రయము, ఆకాశము. ఆకాశమునకు, గాలి ఆశ్రితము. ఈ రెండింటికి అవినాభావ సంబంధము, అన్యోన్యాశ్రయము. అదియే భగవంతునకు, మానవునకు ఉన్న సంబంధము. ఆత్మయందు తాను, తనయందు ఆత్మ అన్న అవినాభావ సంబంధాన్ని గుర్తించి వర్తించినప్పుడే ఈ దివ్యత్వమనేది మనకు అర్థమవుతుంది.

**ప్రతి మానవుడుకూడా అవతారమే!**

భగవంతుడు ఐదు విధములైన స్వరూపములతో ఈ భూమిపైన అవతరిస్తున్నాడు. ఒకటి

sri sathyasai vahanamrutam

నిత్యావతారము, రెండవది విశేషావతారము, మూడవది అవిశేషావతారము, నాల్గవది లీలావతారము, ఐదవది పూర్ణావతారము. ఈ లీలావతారమే అంశావతారమనికూడా చెప్పవచ్చు. నిత్యావతారము, విశేషావతారము, అవిశేషావతారము ఐదునుండి తొమ్మిదివరకున్న కళల స్వరూపము మాత్రమే! ఒక్క పూర్ణావతారమే పదహారు కళలతో నిండి వుంటుంది. అట్టి పూర్ణావతారమునే దైవముగా మన పూర్వీకులు విశ్వసిస్తూ వచ్చారు. ఏతా వాతా, ప్రతి మానవుడుకూడా అవతారమే! అవతరించటముచేతనే అతనికి 'అవతారము' అని పేరు. అంతేగాని, దైవము ఈ జగత్తులో ప్రత్యేకమైన ఒక వికార స్వరూపమును ధరించి సాక్షాత్కరించటము లేదు. ఒక ఏనుగు, ఒక ఎలుక, ఒక మానవుడు ఇలా ఏ జీవియైనా భగవంతుడనే సముద్రమునుండి అనుగ్రహాన్ని నింపుకొని రాగలవు. ఏనుగు, ఎలుక, మానవుడు ఇవన్నీ పాత్రధారులే! తమ తమ పాత్రను పురస్కరించుకొని దైవత్వమనే అనుగ్రహ జలమును నింపుకొని రాగలవు. రూపమునందు భేదములుండవచ్చునుగాని వాని యందుండిన జలము భగవత్ తత్త్వమే! సర్వుల యందుండిన భగవంతుడు ఒక్కడే! అందరూ అవతార స్వరూపులే!

### ప్రతి మానవుని ప్రేమించండి, గౌరవించండి

దైవమును వెతకటంకోసం మనము ప్రత్యేకమైన ప్రదేశమునకు పోనక్కర లేదు. ప్రతి మానవుని గౌరవించండి. ప్రతి మానవుని ప్రేమించండి. ఈ ప్రేమ అనేది సేద్యముతో పండించుకొనే పంటకాదు. ఈ ప్రేమ అనేది అంగడిలో పెట్టి అమ్మేదికాదు. ప్రభువుకాని, సామాన్య ప్రజలుకాని, ఎవరైనా అహంకారమును విడిచిపెట్టి త్యాగమునకు పూనుకొన్నప్పుడే ప్రేమ ఆవిర్భవిస్తుంది.

**నేను నేనుగా వున్నంత నీవుగావు**
**నీవు నీవుగా వున్నంత నేనుగాను**
**నీకు నాకు యిందులో స్థలము లేదు**
**ఉన్నదొక్కటే హృదయంబు ఎన్నగాను**

ఈ హృదయమనేది నేను, నీవు కూర్చునే Chair కాదు. ఇది double sofa కాదు. ఇది musical chair కాదు. అదే 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి.' ఆ నిజమైన తత్త్వమే

srisathyasaivachanamrutam

హృదయము. ఆ హృదయము ఒక్కటేగాని, రెండు కాదు. నీవు నేను అన్న భావములు త్యజించి, ఏకత్వాన్ని వరించి, దివ్యత్వాన్ని అనుభవించినప్పుడు నీవే అవతారపురుషుడవు.

ప్రేమస్వరూపులారా! మానవజన్మ దుర్లభమైనది. ఇట్టి మానవ జన్మ యెత్తియు తన తత్త్వాన్ని తాను గుర్తించుకోటానికి ప్రయత్నించుకొనక బాహ్యజగత్తునందు భగవంతుడు కలడని భ్రమించుకోటమే పెద్ద అజ్ఞానము. కనుక, కాలమును వ్యర్థము చేయక, కాయముతో కర్మలాచరించి దివ్యత్వాన్ని గుర్తించటానికి ప్రయత్నించండి. మానవత్వాన్ని గౌరవించటానికి ప్రయత్నించండి. నిజముగా దైవమును పూజించాలనుకున్నప్పుడు మానవాకారముతోనే పూజించండి. ఇతరమైన ఏ ఆకారములను మనము దైవముగా భ్రమించినప్పటికి అవి కృత్రిమమైనవే! కల్పనలతో కూడినవే! భ్రమలతో చేరినవే! ఈ భ్రమ పోయేటంతవరకు బ్రహ్మ మనకు సాక్షాత్కరించడు. కనుక, ఈ భ్రమలను మనము దూరము చేసుకోవాలి.

## నిన్ను నీవు దైవత్వముగా విశ్వసించుకో!

ఎంతోమందో, ఎన్ని విధములుగానో భగవంతుని వర్ణిస్తూ వస్తున్నారు. వేదశాస్త్రయితిహాస పురాణములందు చక్కని ప్రమాణములను బోధిస్తున్నారు. ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రములందు ఈ బ్రహ్మతత్త్వాన్ని అనేకవిధములుగా వర్ణిస్తూ వచ్చారు. ఇలా వర్ణనలతోనే తృప్తి పడుతున్నారుగాని భగవత్తత్త్వమును గుర్తించటానికి ప్రయత్నించటం లేదు. నిరాకార నిర్గుణ స్వరూపుడైన భగవంతునికి ఒక ఆకారమేమిటి? ఒకవేళ అటువంటి ఆకారాన్ని నీవు చూడటానికి యిష్టపడితివా యిది కేవలము ఒక వికారముగా రూపొందుతుంది. నీ ఆకారాన్నే నీవు దైవత్వముగా విశ్వసించుకో! నిన్ను నీవు గౌరవించుకో! ఇతరులను గౌరవించు. నిన్ను నీవు ప్రేమించు, యితరులను ప్రేమించు. ఇలాంటి దివ్యమైన విశాలమైన భావాలు ప్రాచీనకాలమునుండికూడా సరియైన ప్రచారప్రబోధలు లేకుండా పోవటమువల్లనే మానవుడు యిన్ని విధములైన అజ్ఞానమునకు గురి అయిపోవుచున్నాడు.

## అహంకార, మమకారములనే రెండు భ్రమలను దూరము చేసుకోవాలి

భగవంతుడు అవతరించటముగాని, అంత్యమొందుటగాని వుండదు. తాను ధరించిన దేహము నీటిబుడగవంటిది.

sri sathyasai vachanamrutam

**నీటి యందె పుట్టి నీటనేపెరిగి**
**నీటి యందదంగు నీటి బుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**
**సత్యమైన బాట సాయి మాట**

నీటిబుడగ జలమునందు పుట్టి, జలమునందు పెరిగి, జలమునందే లయమై పోతుంది. మానవుడుకూడా అంతే! బ్రహ్మయందే పుట్టి, బ్రహ్మయందె జీవించి, బ్రహ్మయందె లయమొందుచున్నాడు. భ్రమకానిదే బ్రహ్మ. జీవితమంతా భ్రమలతోనే నిండిపోయినది. జీవితమంతా భ్రమలతోనే జరుగుతున్నది. మమత్వమనే భ్రమ, అహంకారమనే భ్రమ ఈ రెండింటిని దూరం చేసుకోవాలి.

**దైవత్వమును ఆరాధించగోరే ప్రతి మానవుడు మానవాకారాన్నే ఆరాధించాలి**

దైవత్వాన్ని గుర్తించి, దైవత్వాన్ని విశ్వసించి, దైవత్వాన్ని ఆరాధించగోరే ప్రతి మానవుడు మానవాకారాన్నే ఆరాధించాలి. విశ్వరూపములో వున్న భగవంతుని ఏ విధముగా ఆరాధించగలవు? ఏది నీవు ఆయనకు అర్పించగలవు?

**బ్రహ్మాండమంతట ప్రబలుచుండిన తనకు**
**ఆలయంబు నమర్చ అలవియగున**
**కోటిసూర్యులకాంతి మేటి గల్గిన తనకు**
**ప్రమిద దీపము నెవరు పట్టగలరు**
**అజహరాదులకైన అందని వాని**
**యే రూపు వర్ణించ నెవరితరము**
**సర్వజీవులయందు సంచరించెడి తనకు**
**సరియైన పేరిడ సాధ్యమగున**
**బ్రహ్మాండమంతయు బొజ్జలోనున్నట్టి తనకు**
**భక్ష్య భోజ్యములు పెట్టతగున**
**వసుధ తెలుపుచునున్నది సాయిబాబాయనుచు**

srisathyasaivachanamrutam

**వసుధ తెలుపుచునున్నది శ్రీరామయనుచు**
**వసుధ తెలుపుచునున్నది శ్రీకృష్ణయనుచు**
**వసుధ తెలుపుచునున్నది జీసస్సుఅనుచు**
**వసుధ తెలుపుచునున్నది అల్లా యటంచు**
**వసుధ తెలుపుచునున్నది జోరాష్ట్రయనుచు**
**వసుధ తెలుపుచునున్నది శ్రీ బుద్ధడనుచు**
**ఇంతకన్నను వేరెద్ది ఎరుగరయ్య**
**అంతటనున్నది ఒక్కటే ఆత్మ అనుము**

కనుక దైవమును సర్వాకారములో ఆరాధించి, సర్వజ్ఞత్వముతో పూజించి సమత్వముతో చేర్చుకొనే భావమే మన ఆరాధన.

**మనసు, మాట, క్రియయందు ఏకత్వము కలిగియుండాలి**

ప్రేమస్వరూపులారా! భగవంతుని ప్రధానమైన స్వరూపము ప్రేమయే! భగవంతుని స్వరూపము సత్యమే! అది పరమాణువులకంటెకూడా అతి సూక్ష్మముగా వుంటుంది. కనుకనే Truth is more fundamental than atom అన్నారు. సైంటిస్టులు atom అతి సూక్ష్మమైనదిగా భావిస్తున్నారు. అన్నింటికంటె అతి సూక్ష్మమైనది సత్యము. సత్యమే సర్వత్ర వ్యాపించినటువంటిది. అట్టి సత్యస్వరూపాన్ని గుర్తించి ఆరాధించటం అత్యవసరము. సత్యాన్ని విస్మరించి, సత్యస్వరూపాన్ని పూజించినంతమాత్రమున ఒరిగేదేమి లేదు. కనుక, మనము సత్యాన్ని పాటించాలి. ఈ సత్యమునుండి ఆవిర్భవించినదే ధర్మము. ధర్మము మన హృదయ స్థాయినుండి ఏర్పడినదే! తనకు తాను తృప్తి కలిగించునదే ధర్మము. ఈ ధర్మము Self consciousness. ఇటువంటి ఉత్తమమైన జీవితమును మనము విశ్వసించాలి. తన conscienceకు ఎవరూ ఎదురుగా పోకూడదు. ఈ విధముగా పోవటమే వికృతము. conscienceకు తగినట్లుగా ప్రవర్తించటమే సుకృతము. సరైన మార్గములో సరైన తృప్తి నందుకోటమే ఆరాధన. మనస్సులో ఒకటి, మాటలో మరొకటి యిది దివ్యత్వమునకు సన్నిహితము కాదు. కనుక మనము మనసునందును, మాటయందును, క్రియయందును ఏక స్వరూపాన్ని ధరింపచేయాలి.

sri sathyasai vachanamrutam

## అందరియందు ఉండిన ఏకత్వమే దైవత్వము

మన బ్రతుకు నిమిత్తము మనమిన్ని బాధలు పడుతున్నాముగాని దైవము ఒక్కడే! నీ ఆకారములు, నీ సిద్ధాంతములు వ్యక్తిగతమైనవే! సమిష్టి స్వరూపమే దైవము. అందరియందుండిన ఏకత్వమే దైవత్వము. ప్రతి వ్యక్తియందు ప్రేమ, సత్యము నిండి వుంటున్నవి. ప్రేమలేని మానవుడు జగత్తున కానరాడు. ఈ ప్రేమను వివిధ మార్గములలో ప్రవేశపెట్టవచ్చునుగాని ప్రేమ మాత్రము ఒక్కటే! ఆ ప్రేమయే దైవము, ఆ ప్రేమయే సర్వులయందు వుండినది. ఆ ప్రేమకు విరుద్ధమైన మార్గమును అనుసరించవద్దు. కనుకనే దైవమును వివిధ రూపములలో ఆరాధించినప్పటికి, ఆ తత్త్వము ఏకత్వమైన ఆత్మతత్త్వముగా విశ్వసించుకోటము అత్యవసరము. పువ్వులు యెన్నైనా వుండవచ్చు. పూజ ఒక్కటేనన్న సత్యాన్ని గుర్తించాలి. అదేవిధముగా ఆకారములనేకము వుండవచ్చు, ఆత్మతత్త్వము ఒక్కటే అని గుర్తించాలి.

## మిమ్మల్ని మీరు దివాత్మ స్వరూపులుగా విశ్వసించండి

దైవము ఎక్కడో, ఏదో స్థానములో వున్నాడనే భ్రమను దూరము చేసుకోండి. నేనే దైవమనే దానిని విశ్వసించండి. మిమ్మల్ని మీరు దైవముగా భావించండి. అప్పుడు ఎట్టి పెడమార్గములు పట్టుటకు వీలుకాదు. దైవమార్గము అనుసరిస్తూ పొండి. ప్రతి మానవునియందు దైవమున్నాడని విశ్వసించండి. 'ఈశావాస్య మిదం సర్వమ్' 'వాసుదేవ మిదం సర్వమ్' 'ఏకోవసి సర్వభూతాంతరాత్మ' ఇన్ని విధములుగా వేదములు, ఉపనిషత్తులు తెలుపుచున్నప్పటికి, దానిని మనము తెలుసుకొనలేక కేవలము పాండిత్యములోపల మన జీవితాన్ని వ్యర్థముచేసుకుంటున్నాము. అనేక గ్రంథములను చదివినంతమాత్రమున పండితుడు కాలేడు. గొప్ప ఉపన్యాసములిచ్చినంతమాత్రమున పండితుడు కాలేడు. వేదశాస్త్ర యితిహాస పురాణములు కంఠస్థము గావించినంతమాత్రమున పండితుడు కాలేడు. 'పండితాః సమదర్శినః' అన్నారు. సమదర్శనము గలవాడే పండితుడు! అటువంటి పండితుడు భిన్నమార్గమును ఎప్పుడూ అవలంబించడు. పండితులు కంకణములు ధరించవచ్చు, శాలువలు వేసుకొనవచ్చు, కర్ణకుండలములు ధరించవచ్చు; ఇవి బాహ్యమైన ఆడంబరములు తప్ప ఆనందము అతనిలో శూన్యము. కనుకనే మనము గ్రంథములు వ్రాసేటప్పుడుగాని, గ్రంథములు చదివేటప్పుడుగాని

srisathyasaivachanamrutam

భగవంతుడు ఒక్కడే అన్న సత్యాన్ని విశ్వసించి ఆరాధన చెయ్యాలి. నూరు మనము చెప్పటముకంటె ఒకటి చేసి చూపించటము చాలా అవసరము. ఆచారము ప్రధానముగాని, ప్రచారము ప్రధానము కాదు. ఈ ప్రచారముచేతనే నాస్తికత్వము అభివృద్ధి గాంచుతున్నది. ఏ గ్రంథములు వ్రాసినామో, ఏ విషయములు ప్రబోధించినామో దానికి విరుద్ధముగా మనము ప్రవర్తిస్తున్నాము. యిదియే తనకు తాను ద్రోహము చేసుకోటం. ఇలాంటివి మనకు మనము దూరము చేసుకోవాలి. సర్వులూ ఒకే ప్రభువుయొక్క బిడ్డలుగా మనము భావించాలి. ఆయనయొక్క అంశములుగానే మనము విశ్వసించాలి. మనలోవున్న ఆ భగవంతుని అంశములను మనము పెంచుకోవాలి. అప్పుడే మనము అవతార పురుషులుగా తయారౌతాము.

అవతార పురుషులకు, మీకు తేడా లేదు. అన్నీ అవతరించినటువంటివే! ఈ కళలయందు మాత్రమే భేదమున్నది. ఈ కళలను మనము ఆచారముచేత అభివృద్ధి గావించుకోవచ్చును. సమత్వాన్ని అభివృద్ధి గావించుకోవాలి. పవిత్రమైన ప్రేమను పెంచుకోవాలి. క్షణక్షణమునకు తరిగేటువంటిది, క్షణక్షణమునకు పెరిగేటువంటిది ప్రేమ కానేరదు. చావు పుట్టుక లేనట్టి, జీవుని హృదిని నిరంతరము ప్రకాశించేదే, వికసించేదే ప్రేమ. కష్టనష్టములకు, నిందనిష్ఠూరములకు లేక వర్ణనలకు పొంగక, కృంగక వుండేటువంటిదే నిజమైన ప్రేమ. ప్రేమ కదలక, మెదలక నిశ్చలమై వుంటుంది. అటువంటి ప్రేమయే నిజమైన భక్తి. ఈనాడు మనకు దండిగా ఆదాయము వచ్చినప్పుడు మన కోరికలు ఫలించినప్పుడు దేవుని ఫోటోలు ఎక్కువ పెడతాము, దండిగా హారాలు పెట్టి పూజిస్తాము. మన కోరికలు విఫలమాయెనా ఫోటోలు తీసేస్తాము. ఇది నిజమైన ప్రేమ అవుతుందా?

## సర్వమానవులందున్న దైవత్వమును భజించుట అత్యవసరము

సర్వపదార్థములందు భగవత్ తత్త్వము వుంటున్నది. కానీ, మానవునకు మానవాకారమే సన్నిహితము. ఇట్టి సన్నిహితమైన మానవత్వాన్ని మనము గౌరవించాలి. ఆ గౌరవించే విధానము తెలుసుకున్నప్పుడు అది నిజమైన ఆరాధన అవుతుంది. సర్వమానవులందున్న దైవత్వాన్ని భజించుట అత్యవసరము. ఇది ఈనాడు మీరు గుర్తించవలసిన ప్రధానమైన విషయము. రాముడు, కృష్ణుడు అనే అవతారములు మానవాకారమును ధరించినవే! ప్రాచీన కాలమునుండి

sri sathyasai vachanamrutam

మనము ఆరాధించిన ప్రతి ఆరాధనా స్వరూపము మానవాకారమే. కనుక, మానవాకారమును గౌరవించి, ఆరాధించటమే ప్రధానమైన పూజ. సర్వజీవులు భగవంతుని ఆకారముగా విశ్వసించటము అత్యవసరము. 'సర్వ జీవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి.'

ఇక్కడ 'కేశవ' అన్నపదము ఎందుకు ఉపయోగపెట్టాలి? ఇందులోనే సృష్టి స్థితిలయములు మూడు యిమిడి వుంటున్నాయి. కేశవలో 'క', 'ఈశ', 'వ' అని వున్నాయి. ఈ మూడూ చేరితే 'కేశవ' అవుతుంది. 'క' అనగా బ్రహ్మ, 'ఈశ' అనగా ఈశ్వరుడు, 'వ' అనగా విష్ణువు. కేశవ అనగా బ్రహ్మ, ఈశ్వర, విష్ణు స్వరూపమే అని అర్థము. బ్రహ్మ అనగా సృష్టితత్త్వము. మన సంకల్పమే బ్రహ్మతత్త్వము. 'ఈశ' అనగా హృదయవాసమే! కనుక, మన హృదయమే ఈశ్వరతత్త్వము. ఈ బుద్ధి తత్త్వమే సర్వత్రా వ్యాపించిన విష్ణుత్వము. యంత్ర, మంత్ర, తంత్ర స్వరూపము మానవాకారమే, అన్య స్వరూపములు కాదు. దానిని విశ్వసించాలి.

ఈ మానవాకారముతో చేయవలసిన సత్కర్మలు మనము చెయ్యాలి. Human Value అనగా ఏమి? దైవత్వమే నిజమైన Human Value. అటువంటి విలువను మనము తెలుసుకోవాలి. ఈ Value మనలో క్రొత్తగా వచ్చి ప్రవేశించినది కాదు. ఈ దేహముతోబాటే అవి ఆవిర్భవించాయి. మన అవసరాన్ని అనుసరించి దానిని అణగద్రొక్కుతున్నాము. స్వార్థమే దానికి మూలకారణము. స్వార్థము వచ్చేసరికి ద్వైతము ఆరంభమవుతుంది. ద్వైతము వచ్చేసరికి రాగద్వేషములు ప్రారంభమవుతాయి. ఈ రాగద్వేషములచేతనే మనలో భవరోగము ప్రారంభమవుతుంది. ఈ రోగములు మనము నివారణ చేసుకోవాలంటే భజన అవసరము.

**(తేదీ. 23-11-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam